క్లుప్తంగా

నియామకం



నర్సంపేట : ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నర్సంపేట మండలంలోని రాజపల్లికి చెందిన విద్యావేత్త, అధ్యాపకుడు పొన్నం రాజును నియమించారు. ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్ ఆధ్వర్యంలో రాజుకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడారు. ముదిరాజ్ కులస్తుల ఐక్యత, రిజర్వేషన్ సాధన కోసం కృషి చేస్తానని తెలిపారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక



గీసుకొండ : మండలంలోని ఎలుకుర్తి హవేలీ జెడ్పీ హైస్కూల్ విద్యార్థి యశ్వంత్ ఈనెల 23 నుంచి మెదక్ జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు సతీశ్‌చంద్ర తెలిపారు. పాఠశాల ఆవరణలో యశ్వంత్‌ను ఆయనతోపాటు ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడారు. యశ్వంత్ ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్టు తెలిపారు.

సన్మానం



నర్సంపేట రూరల్ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తూ హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందిన సందర్భంగా గుడికందుల కుమారస్వామిని టౌన్ సీఐ రమణమూర్తి, ఎస్సై అరుణ్ శాలువాతో సన్మానించారు. అనంతరం సీఐ మాట్లాడారు. సుదీర్ఘ కాలంగా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి హెడ్ కానిస్టేబుల్‌గా ఉద్యోగోన్నతి పొందడం అభినందనీయమని తెలిపారు. భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.

మున్సిపల్ కమిషనర్‌కు..



వర్ధన్నపేట : స్థానిక మున్సిపల్ కమిషనర్ సుధీర్‌కుమార్‌ను బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ పట్టణ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కొండేటి శ్రీనివాస్ మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవాభావంతో విధులు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఐత ఎల్లయ్య, కొండేటి సుధాకర్, కొండేటి రమేష్, బాల్య రమేష్ తదితరులు ఉన్నారు.

కళాశాల స్టాఫ్ సెక్రటరీకి..



సంగెం : తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టీజీఓ) జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా ఎన్నికైన సందర్భంగా స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సీనియర్ అధ్యాపకురాలు, స్టాఫ్ సెక్రటరీ బండి విజయ నిర్మలను ప్రిన్సిపాల్ కాక మాధవరావు, ఉద్యోగులు శుక్రవారం పూలబొకే అందించి శాలువాతో సన్మానించారు. అనంతరం ప్రిన్సిపాల్ మాధవరావు మాట్లాడారు. విజయ నిర్మల అసోసియేషన్ జిల్లా కార్యవర్గ సభ్యురాలిగా ఎంపికవడం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని విజయ నిర్మలను కోరారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ రాజ్‌కుమార్, అధ్యాపకులు బుచ్చిరెడ్డి, నాగరాజు, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మొదటి రోజు ఉత్సవాల్లో భాగంగా ఉదయం విశ్వక్సేన ఆరాధన, స్వస్తి పుణ్యాహ వచనం, నవకలశ స్నపనం, ఆరగింపు, తీర్థప్రసాద వితరణ చేపట్టారు. సాయంత్రం అంకురార్పణ, దీక్షాధారణ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు, ఈఓ శేషగిరి, అర్చకులు రామాచారి, విష్ణు, ఫణీంద్రాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం భద్రపర్చడంలో మెళకువలు

- ఆరబెడితేనే తేమ శాతంలో తగ్గుదల
- ఎలుకలు, ఇతర కీటకాల నుంచి రక్షణ



ధాన్యం ఆరబెడుతున్న మహిళా రైతు

వర్ధన్నపేట : వానాకాలం వరికోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు పండించిన ధాన్యంలో కొంత బియ్యం పట్టించుకోవడానికి భద్రపర్చడం పరిపాటి. కొందరు రైతులు వడ్లను ఇంట్లోనే బస్తాల్లో నిల్వ చేస్తారు. ఇంట్లో బియ్యం నిండుకోగానే నిల్వ చేసిన ధాన్యాన్ని పట్టించి వాడుకుంటారు. మరికొందరు సీజన్ ప్రారంభంలో ధర తక్కువగా ఉంటుందన్న కారణంతో ధాన్యాన్ని విక్రయించుకుండా అధిక ధర వచ్చే దాకా ఇంట్లోనే నిల్వ చేస్తారు. ఈ క్రమంలో ధాన్యం భద్రపర్చడంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే పండించిన పంటలో 10–20 శాతం నష్టపోయే ప్రమాదం ఉంటుందని స్థానిక వ్యవసాయ విస్తరణాధికారి (ఏఈఓ) మౌనిక తెలిపారు. ధాన్యం భద్రపర్చడంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆమె వివరించారు.

నూర్పిడి తర్వాత ఇలా...

ధాన్యం నూర్పిడి తర్వాత ఇంటి అవసరాలు, విత్తనాలకు కలిపి సుమారు ఏడాదికిపైగా భద్రపర్చాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ధాన్యం రంగు చెడిపోయే, రుచి తగ్గే అవకాశాలు మెండుగా ఉంటాయి. సాధారణంగా వరి కోతల సమయంలో ధాన్యంలో 20 శాతం తేమ ఉంటుంది. గతంలో కూలీలతో వరి పంట కోయించిన తర్వాత వరి మొదలు ఆరబెట్టడం వల్ల 4–6 శాతం తేమ తగ్గేది. ధాన్యంలో 14 శాతానికిపైగా తేమ ఉంటే బూజు పట్టే ప్రమాదం ఉంది. కాగా ప్రస్తుతం రైతులు కూలీలపై ఆధారపడకుండా యంత్రాల వైపు మొగ్గు చూపుతున్నారు. పంట పచ్చగా ఉన్నపుడే వరి కోస్తున్నారు. దీంతో ధాన్యంలో మరింత తేమ ఎక్కువగా ఉండే అవకాశాలున్నాయి. ధాన్యాన్ని బాగా ఆరబెట్టి తేమ శాతం 14లోపు తగ్గేలా చూసుకోవాలి. ధాన్యాన్ని భద్రపర్చే సమయంలో జాగ్రత్తలు తీసుకోకపోతే కీటకాలు ఆశించి నష్టం కలిగే అవకాశం ఉంది. ఎలుకలు ధాన్యాన్ని తినడమే కాక వాటి విసర్జనతో కలుషితమయ్యే ప్రమాదం ఉంది.

భద్రపర్చిన ధాన్యాన్ని నష్టపర్చే కీటకాలు..

ముక్క పురుగు : పంట పంట కోయడానికి ముందు ముక్క పురుగు నష్టం కలించే అవకాశాలున్నాయి. బియ్యంలో తెల్లని పురుగులుగా కనిపించేవి లార్వా దశలో ఉన్న ఈ పురుగులే. తల్లి కీటకం వడ్ల గింజకు రంధ్రం చేసి అందులో గుడ్లు పెట్టి తన నోటి నుంచి వెలువడే కొవ్వు పదార్థంతో రంధ్రాన్ని మూసివేస్తుంది. లార్వా ప్రౌఢ దశలోని ముక్క పురుగు గింజ లోపల బియ్యం తింటూ నష్టం కలిగిస్తుంది.

వడ్ల చిలుక : వడ్ల చిలుక ఆశించిన ధాన్యం దుర్వాసన వస్తుంది. తల్లి కీటకాలు వడ్ల గింజలపై చేరి గుడ్లు పెడతాయి. గుడ్లు పగిలి లార్వా గింజ లోపలికి వెళ్లి బియ్యపు గింజను తింటుంది. అనంతరం ప్యూపా దశకు రాక ముందే పై పొట్టులో చిన్న రంధ్రం చేస్తుంది. ప్రౌఢ దశకు చేరిన తర్వాత ఆ రంధ్రం ద్వారా వడ్ల చిలుక బయటకు వస్తుంది. ఇది వడ్ల మూటలలపై, గిడ్డంగుల్లో కనిపిస్తుంది.

మసి పురుగు : దీనికి పుచ్చ పురుగు లేదా పెంకు పురుగు అని పేరు. ఇది గొట్టపు ఆకారంలో చిన్నగా సుమారు 3 మిల్లీమీటర్ల పొడవు ఉంటుంది. ప్రౌఢ కీటకం ధాన్యానికి నష్టం కలిగిస్తుంది. ఆ తర్వాత బియ్యం గింజను తిని నష్టం కలిగిస్తుంది.

ఎలుకల నివారణకు చర్యలు

ధాన్యం గిడ్డంగి చుట్టూ చెత్త లేకుండా ఏరోజుకారోజు శుభ్రం చేయాలి. వివిధ రకాల బోన్లు, బుట్టలు ఉపయోగించి ఎలుకలను నివారించాలి. గిడ్డంగి తులుపుల కింది భాగాలకు జింక్ రేకులు అమర్చాలి. రంధ్రాలకు వైర్ మెష్ మూతలు అమర్చాలి. ఈ విధంగా జాగ్రత్తలు పాటిస్తే ఎక్కువ రోజులు ధాన్యాన్ని నిల్వ చేయవచ్చు.

ధాన్యం నిల్వ చేసే పద్ధతి

రైతులు తక్కువ ధాన్యం నిల్వ చేసుకోవాలంటే వెదురు గుమ్ములు, సిమెంట్, లోహపు గాదెలను ఉపయోగించాలి. ఎక్కువ మొత్తంలో ధాన్యాన్ని నిల్వ చేయాలంటే గోదాములు, గిడ్డంగులను సిమెంట్ కాంక్రీటుతో నిర్మించుకుంటే పూర్తి రక్షణ ఉంటుంది. కీటకాలు, తేమ, వర్షపు నీరు లోనికి చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలుకల రంధ్రాలుంటే గాజు ముక్కలు, సిమెంట్‌తో పూడ్చాలి. ధాన్యం నిల్వలో కొత్త గోనె సంచులు ఉపయోగించాలి. గోనె సంచులపైన, లోపల మలాథియాన్ లేదా ఎండోసల్ఫాన్ ద్రావణం స్ప్రే చేయాలి. మరునాడు సంచులను ఎండలో ఆరబెట్టాలి.

వెంచర్ నిర్వాహకుడికి నోటీసు



నోటీసు అందజేస్తున్న కార్యదర్శి శ్రీనివాస్

వర్ధన్నపేట : మండలంలోని కట్ర్యాల పరిధిలోని ఉప్పరపల్లి క్రాస్ రోడ్డు వద్ద సర్వే నంబర్ 51, 52ల్లో ప్రభుత్వ అనుమతి ఏర్పాటు చేసిన వెంచర్‌కు సంబంధించి నిర్వాహకులకు పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ శుక్రవారం గ్రామ పంచాయతీ తరఫున నోటీసు అందజేశారు. అనుమతి లేకున్నా కాంపౌండ్ వాల్ నిర్మించడంతోపాటు భూమి చదును చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నోటీసులో పేర్కొన్న మేరకు సదరు భూమి ప్రభుత్వ రికార్డుల్లో వ్యవసాయ భూమిగానే ఉంది. వెంచర్ చేయాలంటే ముందుగా వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేయాల్సి ఉంటుంది. అదేం లేకుండానే వెంచర్ చేసి ప్లాట్లు విక్రయిస్తుండడంతో అధికారులు, ప్రజాప్రతినిధులపై ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. నిర్వాహకులు డీటీసీపీ నుంచి అనుమతులు పొందాలన్నా స్థానిక గ్రామ పంచాయతీ అనుమతి తప్పనిసరి. అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన వెంచర్‌లో భూమి కొనుగోలు చేస్తే కొనుగోలుదార్లు నష్టపోవడం ఖాయం.

‘బీసీ కమిటీలను బలోపేతం చేయాలి’

నర్సంపేట : గ్రామాల్లో బీసీ కమిటీలను బలోపేతం చేయాలని భారత చైతన్య పూలే వారసుల రాజ్యం రాష్ట్ర అధ్యక్షుడు ఆబోతు రాజు యాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు వరంగంటి కవిత, డివిజన్ అధ్యక్షురాలు గాదం స్వప్న కోరారు. పట్టణంలోని కార్యాలయంలో నియోజకవర్గ అధ్యక్షుడు బాల్నె సుభాశ్ అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. బీసీల రాజ్యాధికారం లక్ష్యంగా భారత చైతన్య యువజన పూలే వారసుల రాజ్యంలో భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం భారత చైతన్య యువజన పూలే వారసుల రాజ్యం యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సంగినేని లకన్, జిల్లా కార్యదర్శిగా కొండి రాజేశ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

మట్టి రోడ్డు ప్రారంభం

చెన్నారావుపేట : మండలంలోని పాపయ్యపేట శివారులోని సుద్దరేవుల ఆనకట్ట వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేసిన మట్టిరోడ్డును కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆనకట్ట పరిధిలోని రైతులు వాగు దాటడానికి ఇబ్బంది పడుతుండడంతో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి సహకారంతో తాత్కాలిక మట్టి రోడ్డు నిర్మించినట్టు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కొమురయ్య, నర్సింహ, అశోక్, కుమారస్వామి, చంద్రమౌళి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా ప్యాకెట్ల స్వాధీనం

నర్సంపేట రూరల్ : నర్సంపేటలో అక్రమంగా నిల్వ చేసిన రూ.28 వేల 850 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్, ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్ వివరాలను మీడియాకు వెల్లడించారు. పట్టణంలోని కృష్ణవేణికి చెందిన లక్ష్మీ పాన్‌షాప్‌పై స్థానిక పోలీసులతో కలిసి టాస్క్‌ఫోర్స్ బృందం దాడి చేసింది. ఈ సందర్భంగా గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని స్థానిక పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

చికిత్స పొందుతున్న యువకుడి మృతి

సంగెం : మానసిక వ్యాధితో బాధపడుతూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించి వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు పరిస్థితి విషమించి మృతి చెందిన ఘటన మండలంలోని ఆశాలపల్లిలో చోటు చేసుకుంది. వివరాలిలా.. ఆశాలపల్లికి చెందిన మాడిశెట్టి రవికుమార్ (47) సుమారు పదేళ్లుగా మానసిక వ్యాధితో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. కాగా ఈనెల 16న రవికుమార్ పురుగుల మందు తాగి పడిపోయాడు. రవికుమార్‌ను కుటుంబీకులు వెంటనే ఎంజీఎంలో చేర్పగా గురువారం రాత్రి మృతి చెందాడు. మృతుని కుమారుడు ఉదయ్‌కిరణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

ముగ్గురిపై కేసు

సంగెం : ఎస్సారెస్పీ కెనాల్ మొరం తవ్వకాలను అడ్డుకున్న ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని షాపూర్ శివారులోని ఎస్సారెస్పీ కెనాల్ నుంచి కారుణ్య కన్‌స్ట్రక్షన్స్ సంస్థ ప్రతినిధులు టెక్స్‌టైల్స్ పార్కులోని కై టెక్స్ కంపెనీకి మొరం తరలిస్తుండగా గ్రామానికి చెందిన పేరాల దిలీప్‌రావు, పేరాల సమ్మారావు, దొనికెల శ్రీనివాస్ అడ్డుకుని కైటెక్స్ మేనేజింగ్ పార్ట్‌నర్ అనుమాల వెంకటేశ్వర్లుతో వాగ్వాదానికి పాల్పడ్డారు. వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు పోలీసులు దిలీప్, సమ్మారావు, శ్రీనివాస్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఎన్‌సీసీతో విద్యార్థుల జీవితంలో ఉన్నతి

- ఎన్‌సీసీ ఆఫీసర్ రియాజుద్దీన్



మొక్కలు నాటుతున్న రియాజుద్దీన్, విద్యార్థులు

నర్సంపేట రూరల్ : ఎన్‌సీసీతో విద్యార్థుల భవిష్యత్ జీవితంలో ఉన్నతికి మార్గం సుగమమవుతుందని థర్డ్ ఆఫీసర్ రియాజుద్దీన్ తెలిపారు. ఎన్‌సీసీ డేను పురస్కరించుకుని పదో బెటాలియన్ ఆదేశాల మేరకు లక్నెపల్లి శివారులోని బాలాజీ టెక్నో స్కూల్‌లో ఎన్‌సీసీ విద్యార్థులతో కలిసి ఎన్‌సీసీ ఆఫీసర్ రియాజుద్దీన్, ప్రిన్సిపాల్ పెరుమాండ్ల రాజేంద్రప్రసాద్ శుక్రవారం మొక్కలు నాటారు. అనంతరం ఎన్‌సీసీ ఆఫీసర్ రియాజుద్దీన్ మాట్లాడారు. ఎన్‌సీసీలో చేరిన విద్యార్థుల్లో క్రమశిక్షణ అలవడుతుందని చెప్పారు. భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ మొక్కలు నాటం వల్ల పర్యావరణ పరిరక్షణకు బాటలు పడతాయని తెలిపారు. సమాజంలోని ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటి సంరక్షించాలని కోరారు.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



వెంకటేశ్వర్లుకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలని జిల్లా అడ్‌హక్ కమిటీ కన్వీనర్ గుంటి కిషన్, కోకన్వీనర్ జీజుల విజయ్‌ప్రకాశ్ కోరారు. ఈ మేరకు వారు తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమ సంఘం చైర్మన్ బూసాని వెంకటేశ్వర్లుకు శుక్రవారం వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గోదావరి నది తీర ప్రాంతంలోని బెస్త, గుండ్ల బెస్త, రజక, నాయీ బ్రాహ్మణ, బోయ, వడ్డెర, మేదర, పూసల, గంగిరెద్దుల, జోగిని, తదితర 57 బీసీ కులాలు రాజకీయ పదవులకు దూరంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో బీసీ–ఏ కులాల సంఘం కార్యదర్శి డాక్టర్ బయ్య సాంబమూర్తి, నాయకులు జీజుల సాగర్, డాక్టర్ మండల సాంబయ్య పాల్గొన్నారు.

పేదలను ఆదుకోవడమే ధ్యేయం

- ‘ఎస్‌ఆర్‌ఆర్’ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : పేదలను ఆదుకోవడమే ఎస్‌ఆర్‌ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని చైర్మన్, బీఆర్‌ఎస్ నేత పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని పెర్కవేడులో గాయి సమ్మక్క, కంచర్ల రవి, దురిశెట్టి పెద్ద మల్లయ్య, మైలారంలో ఈర్ల కొమురమ్మ, కాట్రపల్లిలో కందుకూరి లక్ష్మి, కేశవాపురంలో జలగం పెద్ద సోమయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బియ్యంతోపాటు, నూనె క్యాన్‌లు సాయంగా అందజేశారు. అనంతరం గాయాల పాలై చికిత్స పొందుతున్న మైలారం గ్రామానికి చెందిన వ్యక్తికి రూ.3 వేల సాయం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడారు. మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాల్లో మాజీ జెడ్పీటీసీ రంగు కుమార్ గౌడ్, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధూకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

చెన్నారావుపేట : గౌడ ఆఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (గోపా) వరంగల్, హన్మకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో ఈనెల 24న ఖిలా వరంగల్‌లోని పిల్లల పార్కులో తలపెట్టిన కార్తీక వనభోజనాల కార్యక్రమ ఆహ్వాన పత్రికలను అసోసియేషన్ జిల్లా కోశాధికారి అనంతుల రమేశ్ మండల కేంద్రంలో శుక్రవారం ఆవిష్కరించి మాట్లాడారు. గౌడ కులస్తులందరూ పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గోపా అసోసియేట్ అధ్యక్షుడు రామగోని సుధాకర్ గౌడ్, మోకుదెబ్బ జిల్లా అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి సాంబయ్య, గౌడ సంఘం అధ్యక్షులు కొమ్మలు, బాబు, ఎల్లగౌడ్, సంతోశ్, సురేందర్, సదానందం, రమేశ్, చంద్రమౌళి, సాంబయ్య, శ్యామ్ పాల్గొన్నారు.

కరపత్రాల..



నర్సంపేట : ఈనెల 26 నుంచి భారత రాజ్యాంగ వేడుకలను విజయవంతం చేయాలని కోరుతూ రూపొందించిన కరపత్రాలను పట్టణంలో నాయకులతో కలిసి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఆర్‌పీఐ–బొజ్జా తారకం) రాష్ట్ర అధ్యక్షుడు జన్ను సాంబయ్య శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవాన్ని అంబేద్కర్ డే ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



నెక్కొండ : ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రంజిత్‌రెడ్డి, తదితరులు

- టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్ రెడ్డి తెలిపారు. మండలంలోని చంద్రుగొండ, పెద్ద కొర్పోలు గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను శుక్రవారం వారు ప్రారంభించి మాట్లాడారు. ప్యాడీ క్లీనర్లతో ధాన్యాన్ని శుభ్రం చేసి నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువాలని చెప్పారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్, మండల సమాఖ్య అధ్యక్షురాలు మార్త లావణ్య, ఏఓ నాగరాజు, ఏపీఎం శ్రీనివాస్, ఏఈఓ నవీన్, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి, నాయకులు

ఖానాపురం : మండలంలోని ఖానాపురం, ధర్మరావుపేట, రంగాపురం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ హరిబాబు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యద్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. రైతులను మోసగిస్తే మిల్లర్లపై చర్యలు తప్పవన్నారు. కార్యక్రమాల్లో నాయకులు సుబ్బారావు, వెంకట ప్రసాద్‌రావు, సాగర్‌రావు, ముస్తఫా, వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలి

- తహసీల్దార్ ఫణికుమార్

చెన్నారావుపేట : రైతులు కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని తహసీల్దార్ ఫణికుమార్ కోరారు. మండల కేంద్రంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించి తేమ శాతాన్ని పరిశీలించే మిషన్ల పని తీరును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతులు తేమ శాతం ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకొచ్చి విక్రయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఓ గోపాల్‌రెడ్డి, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ సలీమ్, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని అశోక్‌నగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏఓ శ్రీనివాస్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ధాన్యాన్ని శుభ్రం చేసి తీసుకొచ్చి నిర్వాహకులకు సహకరించాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఈఓ నాగరాణి, కొనుగోలు కేంద్రం ఇన్‌చార్జ్ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



ఖానాపురం : ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఏఓ

మతి స్థిమితం లేని మహిళకు చేయూత



గోపమ్మను సఖి సెంటర్‌కు తరలిస్తున్న తిరుమల

నర్సంపేట : మతి స్థిమితం లేని మహిళకు సఖి సెంటర్ ఆధ్వర్యంలో వసతి కల్పించిన ఘటన పట్టణంలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. పట్టణంలోని సంజీవ్‌నగర్‌కు చెందిన మద్దెల గోపమ్మ చిన్నతనంలోనే మతి స్థిమితం కోల్పోయింది. గతంలో గోపమ్మ తండ్రి, సుమారు 10 రోజుల క్రితం తల్లి మృతి చెందడంతో అనాథగా మిగిలింది. దీంతో కాలనీకి చెందిన పాస్టర్ రూబెన్ వరంగల్‌లోని సఖి సెంటర్‌కు సమాచారం అందించారు. ఈ క్రమంలో సఖి సెంటర్ అడ్మినిస్ట్రేటర్ వల్లే శ్రీలత స్పందించి స్టాఫ్ కేస్ వర్కర్ తిరుమలను, సిబ్బందిని నర్సంపేటకు పంపించారు. స్థానికుల, ఎస్సై అరుణ్ సహాయంతో గోపమ్మను వసతి గృహానికి తరలించారు. ఈ సందర్భంగా సఖి కేస్ వర్కర్ తిరుమల మీడియాతో మాట్లాడారు. సఖి సెంటర్ ద్వారా బాధిత మహిళలకు అనేక సేవలు ఉచితంగా అందిస్తున్నట్టు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు 181 నంబర్‌కు ఫోన్ చేస్తే సహాయం అందిస్తామని వివరించారు.

ప్రభుత్వ పథకాలతో పేదలకు లబ్ధి



మాట్లాడుతున్న సుమన్

చెన్నారావుపేట : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి చేకూరుతుందని తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీం లీడర్ నెల్లుట్ల సుమన్ తెలిపారు. మండలంలోని ఖాదర్‌పేటలో ఆయన ఆధ్వర్యంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలకు పాటలతో శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడారు. ఉచిత విద్యుత్, రుణమాఫీ, ధాన్యానికి బోనస్, తదితరాలతో ప్రభుత్వం పేదలకు తోడ్పాటు అందిస్తోందని చెప్పారు. పేదలు సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాకరులు యోచన, తాళ్ల సునీల్, పడిదం రాజేందర్, గాదెపాక బాబు, బరిగెల రవీందర్, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

రక్షణ చట్టాలపై అవగాహన అవసరం



సమావేశంలో మాట్లాడుతున్న ఇందిర

గీసుకొండ : స్వయం సహాయక సంఘాల మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన అవసరమని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ ఇందిర తెలిపారు. మండలంలోని కొమ్మాలలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధులకు లింగ ఆధారిత హింస నివారణ, మహిళా రక్షణ వ్యవస్థల అనుసంధానంపై శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. కుటుంబ వ్యవస్థ బలంగా ఉంటేనే సమాజంలో శాంతి, సేవాభావం పెంపొందుతాయని చెప్పారు. భవిష్యత్ తరాలకు జీవన విధానంపై గౌరవం, నమ్మకం పెరుగుతాయని తెలిపారు. మహిళా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వయం సహాయక సంఘం అధ్యక్షురాలు ప్రవళిక, సర్వోదయ సంస్థ ఫీల్డ్ ఆఫీసర్ అక్తర్, వీఓఏ వాంకుడోతు రాజు, కార్యదర్శి సౌందర్య, అంగన్‌వాడీ టీచర్ సునీత తదితరులు పాల్గొన్నారు.

క్షీరాభిషేకం

రాయపర్తి : మండలంలోని పెర్కవేడుకు చెందిన ముగ్గురు రైతులకు ప్రభుత్వ బోనస్ అందడంతో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి చిత్రపటాలకు రైతులతో కలిసి నాయకులు శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్‌రెడ్డి మాట్లాడారు. రైతుల ఆర్థికాభివృద్ధే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు తీగల సాయిలు, ఇల్లంద మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, నాయకులు మాచర్ల ప్రభాకర్, ఊగ మునిత, పుల్లూరు దామోదర్, తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయా మృతి

దుగ్గొండి : అనారోగ్యంతో బాధపడుతూ పరిస్థితి విషమించి అంగన్‌వాడీ ఆయా మృతి చెందిన ఘటన మండలంలోని తొగర్రాయిలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాలిలా.. గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా బూసాని ఎల్లమ్మ (60) కొద్ది రోజుల క్రితం అనారోగ్యం బారిన పడింది. ఈ క్రమంలో వైద్యం చేయించుకుంటూ శుక్రవారం ఉదయం మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలి

చెన్నారావుపేట : ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మాజీ వైస్ ఎంపీపీ కంది కృష్ణారెడ్డి కోరారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించి ధాన్యాన్ని పరిశీలించి మాట్లాడారు. వర్షాలు కురిసే అవకాశం ఉందని, వెంటనే ధాన్యం కొనుగోళ్లు నిర్వహించాలని కోరారు.

ఆర్థికసాయం

దుగ్గొండి : మండలంలోని నాచినపల్లిలో లోడె హరీశ్ మృతి చెందగా అంత్యక్రియల కోసం న్యూ కాకతీయ ఆటో యూనియన్ నాయకులు, ఆటోడ్రైవర్లు శుక్రవారం రూ.3 వేల సాయం అందజేశారు. తొలుత బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. హరీష్ గురువారం రాత్రి మృతి చెందగా ‘రోడ్డు పక్కన యువకుడి మృతదేహం’ శీర్షికతో ‘సాక్షి’లో ప్రచురితమైన కథనానికి ఆటోడ్రైవర్లు స్పందించి సాయం అందించారు.

కమిటీ ఎన్నిక

రాయపర్తి : టాక్సీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని కాట్రపల్లికి చెందిన మహ్మద్ రఫీ, ప్రధాన కార్యదర్శిగా అంకూస్ ఎన్నికయ్యారు. వారికి యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి శుక్రవారం నియామక పత్రాలు అందజేశారు.